# సాక్షి అనకాపల్లి

మంగళవారం, 16, ఏప్రిల్, 2024






**శివుడి ఆజ్ఞ వల్లే ఇక్కడికి వచ్చా...**

నాతవరం మండలంలోగల శ్రీశివశక్తి క్షేత్రంలో 50 పడకల ఆస్పత్రి శంకుస్థాపనకు సినీ నటుడు సుమన్ విచ్చేసారు. 8లో



**పోలింగ్ ప్రక్రియపై అవగాహన**

ఎన్నికల విధుల్లో ప్రిసైడింగ్ అధికారులు ప్రతి అంశాన్ని సూక్ష్మ పరిశీలన చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. 8లో

గరిష్టం/కనిష్టం
37.5/25.0

**వాతావరణం**

వాతావరణం పొడిగా ఉండే అవకాశముంది. వడగాలులు ఒకటి లేదా రెండు చోట్ల వీచే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరీ తెలిపారు.

# ప్రతి ఇంటా జగన్నినాదం



నాతవరం సభకు హాజరైన భారీ జనం, (ఇన్‌సెట్) ప్రసంగిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

- మన విజయాన్ని ఎవరూ ఆపలేరు
- కూటమికి ఓటుతో బుద్ధి చెప్పండి
- నర్సీపట్నం నియోజకవర్గంలో రూ.1,700 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

నాతవరం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. నర్సీపట్నం నియోజకవర్గ పరిధి నాతవరం మండలంలో ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాల పేరిట ఏర్పాటు చేసిన ప్రతీ పథకం జగన్ ఆలోచనలో భాగం అని తెలిపారు. విద్యా, వైద్యం, వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ అమలు చేస్తే, ఆ తర్వాత చంద్రబాబునాయుడు పూర్తిగా నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. మరలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు చికిత్సల ఖర్చు పరిమితి పెంచారన్నారు. రాష్ట్రంలో 15 వేల గ్రామ సచివాలయాలు, 10 వేల ఆర్బీకేలు, 10 వేల హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజల వద్దకే సేవలందిస్తున్నామన్నారు.

ఎన్నికల్లో కూటమి పేరుతో వస్తున్న టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. సంక్షేమ పథకాలు లబ్ధి పొందిన ప్రతి ఒక్కరీ గుండెల్లో జగన్ ఉన్నంత కాలం వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో రూ.1,700 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి పనులు చేశామన్నారు. మరలా ఎమ్మెల్యేగా పెట్ల ఉమాశంకర్ గణేష్ గెలిపిస్తే మరింత అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. ఎంపీ అభ్యర్థిగా అతిసామాన్య వ్యక్తి బూడి ముత్యాలనాయుడు కాగా, కూటమి నుంచి ఇతర జిల్లా నుంచి సంపన్న వ్యక్తిని దిగుమతి చేసుకున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల పెత్తందారులకు, పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధంగా అభివర్ణించారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు.

**ఇది సామాన్యులకు, పెత్తందారులకు పోటీ : బూడి**

పార్లమెంట్ అభ్యర్థి ముత్యాలనాయుడు మాట్లాడుతూ రైతు కుటుంబం నుంచి వచ్చిన తనకు రెండు సార్లు ఎమ్మెల్యేగా, డిప్యూటీ సీఎంగా అవకాశం కల్పించారన్నారు. తనపై పోటీ చేసేందుకు ఈ ప్రాంతంలో ఎవరూ లేనట్లుగా ఎక్కడ నుంచో దిగుమతి చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. నాతవరంలో ఎన్నికల ప్రచారం విజయోత్సవ ర్యాలీగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. మంచి వ్యక్తిగా పేరున్న ఎమ్మెల్యే అభ్యర్థి గణేష్‌ను మంచి మెజార్టీలో గెలిపించాలన్నారు.



ఉత్సాహంగా పార్టీశ్రేణుల బైక్‌ర్యాలీ

**దోపిడీ అయ్యన్నకు ఓటుతో బుద్ధి చెప్పాలి : ఎమ్మెల్యే గణేష్**

టీడీపీలో కార్యకర్తలను, నాయకులను నిరంతరం దూషించే అయ్యన్న ప్రజలకు ఏం మేలు చేశారో తెలపాలని ఎమ్మెల్యే గణేష్ డిమాండ్ చేశారు. అతని కుమారుడు విజయ్ గ్రామాల్లో తిరుగుతూ నోటికొచ్చినట్లు దూషిస్తున్నారన్నారు. ప్రతీ సారి పార్లమెంట్ అభ్యర్థిగా ప్రచారం చేయడం తప్ప ఏనాడూ సీటు పొందలేని దౌర్భాగ్యం దాపురించిందని ఎద్దేవా చేశారు. డబ్బులు కోసమే ఎంపీ సీటు తనదని ప్రచారం చేసి వచ్చిన వారి నుంచి ముడుపులు దండుకోవడం ఆనవాయితీగా మారిందని దుయ్యబట్టారు. అవినీతి అయ్యన్నకు ఓటుతో ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నర్సీపట్నం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, పార్టీ సీనియర్ నాయకుడు బోళెం నర్సింహమూర్తి, డీసీసీబీ డైరెక్టర్ అంకరెడ్డి పార్వతి, డాక్టరు లక్ష్మీకాంత్, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స, పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వర్రావు, పామాయిల్ కార్పొరేషన్ డైరెక్టర్ పైల పోతురాజు, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు, నియోజవర్గ స్థాయి నాయకులు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

**ఉత్సాహంగా బైక్ ర్యాలీ**

ఎన్నికల ప్రచారానికి నర్సీపట్నం, నాతవరం, గొలుగొండ, మాకవరపాలెం మండలాల నుంచి కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. తాండవ జంక్షన్ నుంచి రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే గణేష్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ఏడు కిలోమీటర్ల మేర బైక్ ర్యాలీ నిర్వహించారు. అడుగడుగునా మహిళలు పూలు జల్లుతూ స్వాగతం పలికారు.

## మళ్లీ మన జెండా ఎగరాలి



చోడవరం కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, చిత్రంలో బూడి ముత్యాలనాయుడు, ధర్మశ్రీ, నాగిరెడ్డి, బొడ్డేడ ప్రసాద్

చోడవరం : వైఎస్సార్‌సీపీని తిరిగి అధికారంలోకి తేవడానికి ప్రతి కార్యకర్త పనిచేయాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజనరల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం చోడవరం ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వై.వి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ అధికారం కోసం ప్రతిపక్షాలు కూటమిగా ఏర్పడి చివరికి ముఖ్యమంత్రిపై దాడులకు కూడా పాల్పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్రాభివృద్ధితో పాటు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపర్చారన్నారు. ఇంటింటికీ వెళ్లి మన ప్రభుత్వం అందించిన పథకాలు చెప్పి ధైర్యంగా ఓటు అడగగలుతున్నామంటే అభివృద్ధి, సంక్షేమ పథకాలే కారణమన్నారు.

**చంద్రబాబు పైరవీల కోసమే బీజేపీలోకి బినామీ రమేష్**

తన బినామీగా రమేష్‌ను బీజేపీలోకి పంపిన చంద్రబాబు తన లాబీయింగ్‌ల కోసం వాడుకునేందుకు అనకాపల్లి ఎంపీగా నిలబెట్టారే తప్ప, ఈ ప్రాంత ప్రజల సమస్యలు పార్లమెంటులో మాట్లాడడానికి కాదని సుబ్బారెడ్డి అన్నారు. బీసీ నాయకుడుగా అనకాపల్లి జిల్లా ప్రజల్లో ఒకరైన బూడి ముత్యాలనాయుడ్ని, నిత్యం ప్రజలతో ఉండే చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీని ఈ ఎన్నికల్లో గెలిపించడానికి కార్యకర్తలంతా సమష్టిగా పనిచేయాలని పిలుపు ఇచ్చారు.

**అక్రమ వ్యాపారాల రమేష్‌కు స్థానిక సమస్యలేం తెలుసు : బూడి**

వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ ఎంపీకి తెలియాల్సింది పార్లమెంటు కానీ ఢిల్లీలో గల్లీలు కాదన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ దేశవ్యాప్తంగా అక్రమ వ్యాపారాలు చేస్తున్నారు కాబట్టి అన్ని భాషలు మాట్లాడతాడని, నాకు అనకాపల్లి పార్లమెంటు పరిధిలో ప్రజల సమస్యలు పార్లమెంటు దృష్టికి తీసుకెళ్లగలిగే విజ్ఞత ఉందన్నారు. ఎంపీ పరిధిలో అన్ని నియోజకవర్గాల పేర్లు, గ్రామాల పేర్లు వారు చెప్పగలరా? అని బూడి ప్రశ్నించారు. ధర్మశ్రీ, తాను కలిసి చోడవరం నియోజకవర్గం అభివృద్ధికి మరింతగా కృషి చేస్తామన్నారు.

**గోవాడ సుగర్స్‌ను ఆదుకున్నది మేమే...**

ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ పదేళ్ల పాటు ఎమ్మెల్యేగా ఉండి టీడీపీ అభ్యర్థి రాజు ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. ఈ ప్రాంత రైతాంగానికి జీవనాధారమైన గోవాడ సుగర్ ఫ్యాక్టరీని తన అనుచరుడైన గూనూరు మల్లునాయుడుతో కలిసి రూ.150 కోట్లు దోచుకు తిని అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో గ్రాంట్‌గా నిధులు తెచ్చి రూ.120 కోట్లు అప్పులు తీర్చి ఫ్యాక్టరీని కాపాడామన్నారు. మెయిన్‌రోడ్డు కాంట్రాక్టర్ టీడీపీకి చెందిన వాడు కావడంతో ఆయనను అడ్డుపెట్టుకొని రోడ్డు వేయకుండా నిలిపివేసి రాజకీయ లబ్ధి పొందాలని చూశారని, కానీ సొంత నిధులతో రోడ్డు వేయించానని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రాంత జనం కష్ట సుఖాలు తెలిసిన నాయకులైన ముత్యాలనాయుడు, ధర్మశ్రీని గెలిపించాలన్నారు. డిప్యూటీ కో ఆర్డినేటర్ తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అందించిన పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లి ఓట్లు అభ్యర్థించాలన్నారు. నియోజకవర్గం పరిశీలకుడు కాశీవిశ్వనాథ్, రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### మలేరియాను నిర్మూలిద్దాం

- తాటిపర్తిలో తొలివిడత దోమల మందు పిచికారీ
- ప్రారంభించిన డీఎంవో వరహాలుదొర



దోమల నివారణ మందు పిచికారీ ప్రారంభిస్తున్న జిల్లా మలేరియా అధికారి వరహాలుదొర, ఎంపీడీవో కాళీప్రసాద్

మాడుగుల రూరల్: మలేరియా ప్రభావిత గ్రామాల్లో ముందస్తుగా దోమల మందు పిచికారీ ద్వారా గ్రామాల్లో మలేరియా వ్యాధి ప్రబలకుండా చర్యలు చేపట్టామని జిల్లా మలేరియా అధికారి కె. వరహాలుదొర అన్నారు. సోమవారం తాటిపర్తి గ్రామంలో తొలి విడత దోమల మందు పిచికారీ పనులు ఆయన స్థానిక ఎంపీడీవో ఆర్.కాళీప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఆదేశాల మేరకు మలేరియా నివారణ కార్యక్రమంలో భాగంగా, ఇండోర్ రేష్యడల్ మందును చోడవరం మలేరియా సబ్ యూనిట్ పరిధిలో ఐదు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గల 61 గ్రామాల్లో వచ్చే నెల 15వ తేదీ వరకు స్ప్రేయింగ్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రసాదుపాత్రుడు, చోడవరం మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.వి.రమణ, ఆరోగ్య పర్యవేక్షకులు, వెంకట్రావు, సహాయకులు నీలాంబరంతో పాటు స్థానిక ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, ఏఎన్ఎంలు సువర్ణ, రాణితో పాటు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ పరిశీలకుల నియామకం

విశాఖ సిటీ : అనకాపల్లి జిల్లాలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు నియమితులయ్యారు. అనకాపల్లి నియోజకవర్గం పరిశీలకుడిగా కాశీ విశ్వనాథం, చోడవరం నియోజకవర్గం పరిశీలకుడిగా శరగడం చిన్న అప్పలనాయుడును నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాన్ని చేపట్టినట్టు తెలిపింది.


**అభివృద్ధిని చూసి ఓటెయ్యండి..** 8లో


## కొత్తగా నమోదైన ఓట్లు 13,411

- ముగిసిన ఓటరు నమోదు ప్రక్రియ
- 4,035 తిరస్కరణ, 3,672 దరఖాస్తులు పెండింగ్
- వారం రోజుల్లో పరిష్కారానికి ఎన్నికల సిబ్బంది కసరత్తు
- 24న ఓటర్ల తుది జాబితా ఖరారు
- 18న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

సాక్షి, అనకాపల్లి: మహా క్రతువు ముగిసింది.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రధాన ఆయుధమైన ఓటు హక్కును పొందేందుకు ఆదివారమే చివరి రోజు కావడంతో ప్రజలు పెద్ద ఎత్తున ఆన్‌లైన్, ఆఫ్ లైన్‌లో తమ హక్కు పొందేందుకు చివరి ప్రయత్నం చేశారు. జిల్లా వ్యాప్తంగా 21,118మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 13 వేల వరకూ కొత్త ఓటర్లు నమోదయ్యాయి. నామినేషన్ల ప్రక్రియ మరో రెండు రోజుల్లో ప్రారంభం కానుండటంతో తుది ఓటర్ల జాబితాను ఎన్నికల కమిషన్ 24న విడుదల చేసేందుకు కసరత్తు చేస్తోంది.

సంక్షేమ పాలన, అనకాపల్లి జిల్లా సమగ్రాభివృద్ధి కొనసాగించేందుకు సమర్థవంతమైన నాయకుడ్ని మరోసారి ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుంది. ఆ బాధ్యత పొందాలంటే ప్రతి పౌరుడికీ ఓటు హక్కు తప్పనిసరి. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదు కావడానికి ఎన్నికల సంఘం ఇచ్చిన తుది గడువు ఈ నెల 14న ఆదివారంతో ముగిసిపోయింది. జిల్లా యంత్రాంగం దీనిపై పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. అవగాహన సదస్సులు, పోస్టర్లు, బ్యానర్ల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం సఫలీకృతమైంది. ఈ సార్వత్రిక ఎన్నికల్లో తమ వజ్రాయుధాన్ని సాధించేందుకు దరఖాస్తులు చేసుకున్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతతో పాటు మన ఒక్క ఓటు వెయ్యకపోతే.. ఏం జరుగుతుందని వేదాలు వల్లించిన వారూ.. ఈసారి ఎలాగైనా తమ హక్కు సాధించాలన్న సంకల్పంతో కదిలారు. జనవరి 23 నుంచి ప్రారంభమైన ఈ క్రతువులో కొత్తగా ఓటు హక్కు నమోదు పొందేందుకు ఫారం-6, ఫారం-8 ద్వారా 21,118 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 13,411 మందికి ఓటు హక్కు కల్పించగా, 4035 మంది దరఖాస్తుల్ని వివిధ కారణాల వల్ల తిరస్కరించారు. మిగిలిన దరఖాస్తుల పరిశీలనను వారం రోజుల్లోనే పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తులు చేస్తోంది. ఈ నెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల తుది జాబితాను ఈ నెల 24లోగా ఖరారు చేసేందుకు ఎన్నికల సంఘం ప్రణాళికలు సిద్ధం చేసింది.

నియోజకవర్గాల వారీగా వచ్చిన ఫారం-6 ద్వారా నమోదైన కొత్త ఓట్లు...

| నియోజకవర్గం | వచ్చిన దరఖాస్తులు | కొత్తగా చేరిన ఓటర్లు | తిరస్కరణకు గురైనవి |
|---|---|---|---|
| చోడవరం | 2995 | 1964 | 345 |
| మాడుగుల | 2122 | 1368 | 367 |
| అనకాపల్లి | 2975 | 2098 | 391 |
| యలమంచిలి | 3080 | 1709 | 903 |
| పాయకరావుపేట | 3461 | 2026 | 834 |
| నర్సీపట్నం | 4027 | 2484 | 766 |
| మొత్తం | 18,660 | 11,649 | 3606 |

ఫారం-8 ద్వారా జరిగిన మార్పులు చేర్పులు...

| నియోజకవర్గం | వచ్చిన దరఖాస్తులు | కొత్తగా చేరిన ఓటర్లు | తిరస్కరణకు గురైనవి |
|---|---|---|---|
| చోడవరం | 226 | 154 | 35 |
| మాడుగుల | 289 | 242 | 25 |
| అనకాపల్లి | 456 | 340 | 58 |
| యలమంచిలి | 406 | 267 | 106 |
| పాయకరావుపేట | 390 | 227 | 106 |
| నర్సీపట్నం | 691 | 532 | 99 |
| మొత్తం | 2,458 | 1762 | 429 |

### ప్రశాంత ఎన్నికలకు సంపూర్ణ సహకారం



ప్రశాంత ఎన్నికలకు సహకరిస్తామని డీఎస్పీ అప్పలరాజుకు హామీ పత్రం అందజేస్తున్న శాంతి కమిటీ

కశింకోట : రానున్న ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి అంతా సంపూర్ణ సహకారం అందించాలని అనకాపల్లి డీఎస్పీ ఎస్. అప్పలరాజు కోరారు. మండలంలోని పరవాడపాలెం గ్రామంలో గత కొన్ని రోజులుగా యువత వల్ల తరచుగా గొడవలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి సోమవారం రాత్రి గ్రామ సభ నిర్వహించారు. గ్రామ పెద్దలు, అన్ని వర్గాల పెద్దలతో కలిపి శాంతి(పీస్) కమిటీని ఏర్పాటు చేశారు. వారినుద్దేశించి మాట్లాడుతూ భవిష్యత్‌లో ఎలాంటి గొడవలు జరగకుండా కమి టీ బాధ్యతగా చూడాలన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరిస్తామని కమిటీ సభ్యుల సంతకాలతో కూడిన హామీ పత్రాన్ని డీఎస్పీకి అందించారు. సీఐ వినోద్ బాబు, ఎస్ఐ రమేష్‌బాబు పాల్గొన్నారు.

● ఎండలు తీవ్రం...

## అడుగంటిన జలం

- ఫిబ్రవరి కంటే మార్చి నెలలో 0.81 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు
- ఎస్.రాయవరం మండలం ఆర్.కొత్తూరులో 0.68 మీటర్లలోనే అందుబాటులో జలసిరి
- దేవరాపల్లి మండలం తామరబ్బలో అత్యధికంగా 23.80 మీటర్ల లోతులో గంగ
- సేఫ్ జోన్‌లోనే జిల్లా
- భూగర్భ జలశాఖ డీడీ జి.శ్రీనివాసరావు

యలమంచిలి రూరల్ : వేసవి దృష్ట్యా జిల్లాలో భూగర్భ జలాలు పడిపోతున్నాయి. జిల్లాలో 2023తో పోల్చితే భూగర్భంలో నీటి మట్టం మరింత లోతుకు పడిపోయింది. జిల్లా వ్యాప్తంగా మార్చి నెలలో తీసిన భూగర్భ జల మట్టాలను జిల్లా భూగర్భ జల డిప్యూటీ డైరెక్టర్ జి. శ్రీనివాసరావు వెల్లడించారు. ఫిబ్రవరి నెలలో 6.27 మీటర్ల లోతులో ఉన్న జలాలు మార్చిలో 7.08 మీటర్ల లోతుకు అడుగంటాయి. ఫిబ్రవరితో పోల్చుకుంటే మార్చిలో నీటిమట్టం 0.81 మీటర్లు లోతుకు పడిపోయింది. గతేడాది మార్చిలో జిల్లా సరాసరి నీటి మట్టం 3.76 మీటర్లు కాగా ఈ ఏడాది జలాలు 4.68 మీటర్ల లోతుకు పడిపోయాయి. లోటు వర్షపాతం, ముందస్తుగా ఎండలు మండి పోవడంతో బోర్లు, బావుల్లో జలాలు తగ్గిపోతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. దీంతో మార్చిలో నీటి లభ్యత తగ్గింది. ఇంకా వేసవికాలం మరో 50 రోజులు ఉండడంతో జిల్లాలో మరింత లోతుకు భూగర్భ జలాలు చేరే ప్రమాదం ఉంది.

**సేఫ్ జోన్‌లోనే జిల్లా..**

జిల్లాలో 2023 జూన్ నుంచి 2024 ఏప్రిల్ వరకూ సాధారణ వర్షపాతం 1037.16 మి.మీ కాగా 870.47 మిమీ వర్షపాతంతో 16.07 మిమీ లోటు వర్షపాతం నమోదైంది. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరుసగా నాలుగేళ్లు వర్షాలు సమృద్ధిగా కురిశాయి. దీంతో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. ఈ కారణంగా భూగర్భ జలాలు పదిలంగా ఉన్నాయి. ఈ ఏడాది దేశ వ్యాప్తంగా లోటు వర్షపాతం నమోదు కావడంతో గత నాలుగేళ్లతో పోల్చితే భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయి. అయినప్పటికీ జిల్లాలో అన్ని మండలాలు సేఫ్‌జోన్ లోనే ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. 4,292 చదరపు మీటర్ల విస్తీర్ణం ఉన్న జిల్లాలో సగటున ఏడాదికి 76134.74 హెచ్ఏఎమ్‌ల భూగర్భ జలాలు అందుబాటులో ఉండగా అన్ని రకాల వినియోగం కలిపి 20,325.18 హెచ్ఏఎమ్‌గా ఉంది. దీంతో ప్రస్తుతానికి భూగర్భ జలాల సమస్య ఉండదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నారు.

**బాబు హయాంలో ఘోరం**

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న 2014-2018 మధ్యకాలంలో వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు గణనీయంగా క్షీణించాయి. దీంతో పంట పొలాలు బీటలువారి సాగు చేసిన పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం నుంచి పంటల బీమా సక్రమంగా అందకపోవడం, అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆదుకోకపోవడంతో రైతుల ఆత్మహత్యలు సైతం పెరిగిపోయాయి. అప్పటితో పోల్చితే గత ఐదేళ్లుగా భూగర్భ జలాలు స్థిరంగానే కొనసాగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వ్యవసాయానికి అవసరమైన అన్ని సేవలను రైతు ముంగిటకే అందేలా చర్యలు తీసుకున్నారు. దీంతో పాటు అన్నదాతలకు దన్నుగా ఉండేలా అనేక సంక్షేమ పథకాలు కూడా అమలు చేశారు. దీంతో వ్యవసాయం లాభసాటిగా మారిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మండలాల వారీగా తాజా నీటి మట్టాలు (మీటర్లలో)

| మండలం | నీటి మట్టం | మండలం | నీటి మట్టం |
|---|---|---|---|
| నర్సీపట్నం | 1.63 | సబ్బవరం | 6.64 |
| చీడికాడ | 3.26 | రావికమతం | 6.91 |
| మాకవరపాలెం | 3.91 | వి మాడుగుల | 6.99 |
| కశింకోట | 3.92 | రాంబిల్లి | 7.34 |
| ఎస్ రాయవరం | 3.94 | నక్కపల్లి | 7.36 |
| మునగపాక | 4.21 | చోడవరం | 7.45 |
| కోటఉరట్ల | 5.50 | గులుగొండ | 9.53 |
| నాతవరం | 5.53 | పరవాడ | 10.77 |
| యలమంచిలి | 5.60 | బుచ్చెయ్యపేట | 11.11 |
| రోలుగుంట | 5.81 | పాయకరావుపేట | 11.22 |
| కె కోటపాడు | 6.15 | దేవరాపల్లి | 11.59 |
| అనకాపల్లి | 6.58 | అచ్యుతాపురం | 23.93 |





యలమంచిలి మండలం పులపర్తి వద్ద బోరు నుంచి వస్తున్న జలం (ఇన్‌సెట్) భూగర్భ జలాల మట్టాన్ని కొలుస్తున్న అధికారులు

### గత ఏడాది కంటే తగ్గుముఖం



గతేడాదితో పోల్చితే భూగర్భ జలాల మట్టం తగ్గింది. లోటు వర్షపాతమే కారణం. అయినప్పటికీ జిల్లా సేఫ్‌జోన్‌లో ఉంది. వేసవి నేపథ్యంలో వచ్చే 40 రోజుల్లో భూగర్భ జలాలు మరింత క్షీణించే అవకాశం లేకపోలేదు. గత డిసెంబరు నెలలో తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలతో భూగర్భ జలాలు పెరిగాయి. వర్షాలు సమృద్ధిగా కురిస్తే..మళ్లీ భూగర్భ జలాలు పెరుగుతాయి.

–జి.శ్రీనివాసరావు, డీడీ, భూగర్భజల శాఖ

## క్లుప్తంగా

### దేవరాపల్లి ఎంపీపీ రాజీనామా



రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న కిలపర్తి రాజేశ్వరి

దేవరాపల్లి : దేవరాపల్లి ఎంపీపీ పదవికి కిలపర్తి రాజేశ్వరి రాజీనామా చేశారు. ఈమేరకు జిల్లా పరిషత్ సీఈవో ఎం.పోలినాయుడుకు తన రాజీనామా పత్రాన్ని తన భర్త భాస్కరరావుతో కలిసి సోమవారం ఆమె అందజేశారు. తన వ్యక్తిగత కారణాలు దృష్ట్యా తాను తన ఎంపీపీ పదవికి రాజీనామ చేసినట్టు రాజేశ్వరి స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీకి, తన ఎంపీటీసీ పదవికి రాజీనామా చేయలేదన్నారు. కిలపర్తి రాజేశ్వరి అందించిన రాజీనామాను ఆమోదించినట్లేనని జెడ్పీ సీఈవో స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున జిల్లా కలెక్టర్‌తో చర్చించి ఆ పదవిని భర్తీ చేయడంపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

### ప్రమాదంలో కార్మికుడి మృతి

అచ్యుతాపురం : మండలంలోని అచ్యుతాపురం -పూడిమడక రోడ్డులోని దుప్పుతూరుకు సమీపంలో సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వాహనం ఢీకొని కార్మికుడు మృతి చెందాడు. ఇతర రాష్ట్రానికి చెందిన కార్మికుడు కావడంతో వివరాలు తెలియాల్సి ఉందని సీఐ బుచ్చిరాజు తెలిపారు.

### నేటి నుంచి హైదరాబాద్‌కు మరో విమానం

గోపాలపట్నం: విశాఖ నుంచి హైదరాబాద్‌కు రాత్రిపూట మరో విమాన సర్వీసు మంగళవారం అందుబాటులోకి రానుంది. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం హైదరాబాద్ నుంచి ప్రతీ రోజు రాత్రి 9.35 గంటలకు బయలుదేరి విశాఖ విమానాశ్రయానికి 11 గంటలకు చేరుకుంటుంది. తిరిగి విశాఖ నుంచి రాత్రి 11.40 గంటలకు బయలుదేరి రాత్రి 1.50 గంటలకు చేరుకుంటుందని విమానాయాన సంస్థ తెలిపింది.

# అభివృద్ధిని చూసి ఓటెయ్యండి..

- దేవరాపల్లిలో రూ.100 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి
- అనకాపల్లి వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు



దేవరాపల్లి ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, పక్కన మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ

దేవరాపల్లి : దేవరాపల్లిలో జగన్ పాలనలో అభివృద్ధి జరిగిందని మీకు అనిపిస్తేనే అనకాపల్లి వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థిగా తనను, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి తన కుమార్తె ఈర్లె అనురాధను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని అనకాపల్లి వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు అన్నారు. దేవరాపల్లిలో ఆదివారం రాత్రి జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో బూడితో పాటు ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన స్వగ్రామం తారువ మాదిరిగా మేజర్ పంచాయితీ దేవరాపల్లిని సీఎం జగన్ సహకారంతో సుమారు రూ.100 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి పనులు చేపట్టి రూపురేఖలు మార్చామన్నారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న దేవరాపల్లిలో కల్లాలకు తారురోడ్లతో పాటు సీసీ రోడ్లు, డ్రైనేజీ, సామాజిక భవనాలు, ఆర్టీసీ కాంప్లెక్స్ ఆధునికీకరణ వంటి అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శంగా తీర్చిదిద్దానన్నారు. చరిత్ర తిరగరాసేలా అభివృద్ధి చేసిన స్థానికులైన బూడి ముత్యాలనాయుడు, ఈర్లె అనురాధ సేవలు అవసరమో, స్థానికేతరులైన సీఎం రమేష్, పైలా ప్రసాద్ అవసరమో విజ్ఞులైన ప్రజలు ఆలోచించి ఓటేయ్యాలన్నారు. తనను ఎంపీగా, ఎమ్మెల్యేగా తన కుమార్తె అనురాధను పోటీ చేయాలని సీఎం జగన్ ఆదేశించారన్నారు. ఆయన మాటే మాకు శిరోధార్యమన్నారు. ఎప్పటి మాదిరిగానే తాను, తన కుమార్తె అనురాధ అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. నా కంఠంలో ఊపిరి ఉన్నంత వరకు ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేస్తానన్నారు.

**దేవరాపల్లి ప్రజలకు వెన్నుదన్నుగా ఉంటా....**

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన కిలపర్తి భాస్కరరావుకు ఎంతో ప్రాధాన్యమిచ్చి అక్కున చేర్చుకున్న తనపై ఎందుకు అభాండాలు వేస్తున్నారో అర్థం కావడం లేదని ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు అన్నారు. అతని భార్యను ఎంపీపీగా, అతడి వర్గీయులను పంచాయితీ పాలకవర్గ సభ్యులుగా గెలిపించిన తనకు ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో వెన్నుపోటు పొడవాలని చూడడాన్ని సహించలేక పోతున్నానన్నారు. తాను ఎంపీగా, తన కుమార్తె ఎమ్మెల్యే అభ్యర్థిత్వం ఖరారు కావడాన్ని జీర్ణించుకోలేని భాస్కరరావు తనపై అభాండాలు వేస్తూ తమ వర్గీయులతో ప్రచారం చేయడం తనను బాధించిందన్నారు. అయినప్పటికీ తాను, తన కుమార్తె మూడుసార్లు ఇంటికి వెళ్లి కలిసినా తన వ్యవహార శైలిలో మార్పు రాలేదన్నారు. తన కంఠంలో ఊపిరి ఉన్నంత వరకు తన కుటుంబం కిలపర్తి భాస్కరరావు ఇంటి గడప తొక్కేది లేదని తెగేసి చెప్పారు. కిలపర్తి, అతడి వర్గీయుల ప్రలోభాలకు, బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదని, ఏ సమయంలోనైనా ఏ కష్టం వచ్చినా దేవరాపల్లి ప్రజలకు వెన్నుదన్నుగా ఉంటానని బూడి ముత్యాలనాయుడు స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ డా. వరదపురెడ్డి సింహాచలంనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరదపు రెడ్డి లలితానాయుడు, గండిపడాల అప్పలరాజు, గుండు రాంబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి. రమణ, గొర్లె సన్యాసినాయుడు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు గొంప్రుపోటు రమాదేవి, వేచలపు వాణి తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# పోలింగ్ ప్రక్రియపై అవగాహన

- ప్రిసైడింగ్ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి
- జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీవో, ఏపీవో శిక్షణ తరగతుల్లో సూచనలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

యలమంచిలి రూరల్ : ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ ఘట్టం అత్యంత కీలకమైందని, ఎన్నికల విధుల్లో నియమింపబడిన ప్రిసైడింగ్ అధికారులు ప్రతి అంశాన్ని సూక్ష్మ పరిశీలన, అవగాహనతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. సోమవారం యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పీవో, ఏపీవోల శిక్షణా తరగతులకు హాజరైన ఆయన పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఎన్నికలు సజావుగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిపేందుకు ప్రెసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు డెమో బ్యాలెట్ బాక్సులు, ఈవీఎం, వీవీ ప్యాట్ చూపిస్తూ వాటి నిర్వహణ ఎలా చేపట్టాలనే అంశాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కలెక్టర్ యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంను పరిశీలించారు. ఆయన వెంట యలమంచిలి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.మనోరమ, ఏఆర్వో అప్పలరాజు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

**పీవో, ఏపీవోల శిక్షణను పరిశీలించిన కలెక్టర్**

పాయకరావుపేట : ఎన్నికలకు సంబంధించిన సిబ్బంది పీఓ, ఏపీవోలకు శ్రీ ప్రకాష్ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ రవిపట్టన్ శెట్టి సోమవారం పరిశీలించారు. కలెక్టర్ రవిపట్టన్ శెట్టి మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో శిక్షణ స్థలానికి హాజరయ్యారు. అదే సమయంలో పీవోలు, ఏపీవోలు భోజనాలకు వెళ్లిపోయారు. దీంతో శిక్షణ ఇస్తున్న తీరును ఎన్నికల రిటర్నింగ్ అధికారి గీతాంజలిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా పరిషత్ అతిథి గృహం వద్దకు కలెక్టర్ వెళ్లారు. అక్కడ ప్రైవేట్ వ్యక్తులకు చెందిన వాహనాలు ప్యార్కింగ్ చేసి ఉండడంతో వాహనాలు తీయించాలని, ఎన్నికల కోడ్ అని మండల తహసీల్దార్‌కు చెప్పి అక్కడ నుంచి వెళ్లిపోయారు.

**ఎన్నికల కోడ్‌పై సమగ్ర అవగాహన ఉండాలి**

నర్సీపట్నం: ఎన్నికల నిబంధనలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి పీవో, ఏపీవోలకు సూచించారు. ఈవీఎంల పనితీరు, విధి విధానాలపై ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. గతంలో ఎన్నికలు నిర్వహించిన అనుభవం మీకు అందరికీ ఉండవచ్చన్నారు. మరోసారి క్షుణ్ణంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శిక్షణ తరగతుల్లో సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు. అనంతరం నియోజవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెచ్.వి.జయరాం, రిసోర్స్‌పర్సన్‌లు అవగాహన కల్పించారు.

# వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు

- కొత్తయర్రవరంలో జనసేన నుంచి 30 కుటుంబాల చేరిక
- రాజుపాలెం నుంచి 20 మంది యువకులు



కొత్త యర్రవరంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సమక్షంలో పార్టీలో చేరిన జనసేన కార్యకర్తలు



ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సమక్షంలో పార్టీలో చేరిన రాజుపేట యువకులు



పార్టీలో చేరిన యువకులకు కండువాలు కప్పుతున్న వైవీ సుబ్బారెడ్డి

యలమంచిలి : యలమంచిలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీలోకి జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి నుంచి చేరికల పరంపర కొనసాగుతోంది. యలమంచిలి మున్సిపాలిటీ కొత్త యర్రవరం గ్రామం జనసేన పార్టీకి చెందిన సేనాపతి విజయ్‌కుమార్, జాజుల అప్పారావు, జాజుల రమణ, మరో 30 కుటుంబాలు ఎమ్మెల్యే అభ్యర్థి యు.వి. రమణమూర్తిరాజు సమక్షంలో సోమవారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రమణమూర్తిరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో అదరణ పెరిగిందని, ఎన్ని కూటములు వచ్చినా మళ్లీ జగనే సీఎం అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్త, యలమంచిలి మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, రూరల్ పార్టీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, కౌన్సిలర్ పిట్టా సత్తిబాబు, కో ఆప్షన్ సభ్యుడు దూది నర్సింహమూర్తి తదతరులు పాల్గొన్నారు.

**పార్టీలో చేరిన రాజుపాలెం యువకులు..**

మునగపాక : వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పాటు పడాలని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు అన్నారు. మండలంలోని రాజుపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు దుబాసి అప్పలనాయుడు, ముసిలినాయుడు ఆధ్వర్యంలో 20 మంది యువకులు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావడం తథ్యమన్నారు. తద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ తదితరులు పాల్గొన్నారు.

**వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో..**

చోడవరం : టీడీపీకి చెందిన పలువురు యువకులు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేశారు. పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో వారంతా పార్టీలో చేరారు. ముద్దుర్తి గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకులు నంబారు వెంకటేష్‌తో పాటు 20 మంది పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. వారికి సుబ్బారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంకిత భావంతో పని చేయాలని వారికి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు



పాములవాకలో రాజీనామాలు సమర్పిస్తున్న వలంటీర్లు



రాజుపేటలో రాజీనామాలు సమర్పిస్తున్న వలంటీర్లు

కోటవురట్ల : టీడీపీ అధినేత చంద్రబాబు వలంటీర్లపై వేసిన అభాండాలు, నిందలకు మనస్థాపం చెందిన వలంటీర్లు తమ పదవులకు స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుని సగౌరవంగా వలంటీరుగా మళ్లీ విధుల్లో చేరతామని స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలకు పాల్పడుతున్నారు. సోమవారం మండలంలోని పలు సచివాలయాలకు చెందిన వలంటీర్లు 67 మంది తమ రాజీనామా పత్రాలను సంబంధిత సచివాలయాల్లో సమర్పించారు. పాములవాక నుంచి 19 మంది, రాజుపేట నుంచి 14, బి.కె.పల్లి 12, రామచంద్రపాలెం 10, సుంకపూరు 12 మంది రాజీనామా చేశారు. ఎన్నికల్లో ప్రచారం నిర్వహించి వైఎస్సార్ సీపీ గెలుపు కోసం పాటుపడతామన్నారు.

యలమంచిలి రూరల్ : మున్సిపాలిటీ పరిధిలో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. సోమవారం 9 సచివాలయాల పరిధిలో పని చేస్తున్న 103 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను వేర్వేరుగా మున్సిపల్ కమిషనర్ కేఏ కొండలరావుకు అందజేశారు. స్వచ్ఛంద సేవకులైన తమపై టీడీపీ, జనసేన పార్టీల నాయకులు చేస్తున్న సత్యదూరమైన ఆరోపణలతో తీవ్ర మనోవేదనకు గురై తాము రాజీనామా చేస్తున్నట్టు వారు లేఖల్లో పేర్కొన్నారు. వారి రాజీనామాలను కమిషనర్ కొండలరావు సోమవారం రాత్రి అమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పురపాలక సంఘం పరిధిలో 13 సచివాలయాల పరిధిలో ఇప్పటి వరకూ 230 మంది వలంటీర్లు తమ విధులకు రాజీనామా చేసినట్టు కమిషనర్ తెలిపారు. ఇదిలా ఉండగా యలమంచిలి మండల పరిధిలో మరో 21 మంది వలంటీర్లు సోమవారం తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో అప్పలనాయుడుకు అందజేశారు. మండలంలోని 10 సచివాలయాల పరిధిలో ఇప్పటి వరకు మొత్తం 146 మంది వలంటీర్లు రాజీనామా చేశారు.

**చీడికాడ మండలంలో..**

చీడికాడ : మండలంలోని 13 సచివాలయాలకుగాను 11 సచివాలయాలకు చెందిన 121 మంది వలంటీర్లు సోమవారం ముకుమ్మడి రాజీనామాలకు పాల్పడ్డారు. ఇటీవల ప్రతిపక్ష నాయకుల విమర్శలకు మనస్తాపంతో తాము రాజీనామాలు చేస్తున్నట్లు వలంటీర్లు తెలిపారు. తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో ఉమా మహేశ్వరికి అందించారు. నిరుపేదలకు అండగా నిలిచిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా తాము నిలుస్తామన్నారు. తాము మంగళవారం రాజీనామాలు చేయనున్నట్లు ఆయా గ్రామాల వలంటీర్లు తెలిపారు.



ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వరాహపురం వలంటీర్లు



రాజీనామా పత్రాలు చూపుతున్న శిరిజాం సచివాలయం వలంటీర్లు



## పనులు కల్పించాలని నిరసన



మాట్లాడుతున్న ఎంపీడీవో మోహన్‌కుమార్

అనకాపల్లి : మండలంలోని సంపత్‌పురం పంచాయతీ పరిధిలో స్థానిక ఎన్ఆర్‌జీఎస్ కార్మికులకు పనులు కల్పించాలని ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. వారం రోజుల కిందట గ్రామ టీడీపీ సూపర్ సర్పంచ్ కార్మికులను ఇబ్బందులు పెడుతున్నారని, తనకు అనుకూలమైన పార్టీతో తిరగాలని ఒత్తిడి చేయడమే కాకుండా అధికారులకు ఫిర్యాదులు చేయడం ఏమిటని కార్యాలయం వద్ద ఎంపీడీవో మోహన్‌కుమార్‌ను నిలదీశారు. ఈ సందర్భంగా కార్మికులు వరలక్ష్మి, అప్పల నర్సమ్మ మాట్లాడుతూ ఎన్ఆర్‌జీఎస్ కార్మికులపై సూపర్ సర్పంచ్ వేధింపులు ఆపాలని, ఎన్నికల సమయంలో కార్మికుల వద్దకు వివిధ పార్టీల అభ్యర్థులు వచ్చి సమావేశాలు నిర్వహిస్తున్నారని, అయినప్పటికీ అన్ని పార్టీల అభ్యర్థులతోను సమావేశంలో మాట్లాడుతుంటే టీడీపీ సూపర్ సర్పంచ్ తమ పార్టీకి పూర్తి మద్దతు ప్రకటించాలని కోరడం ఏమిటని వారు ప్రశ్నించారు. విధుల నుంచి తొలగించిన ఇద్దరు కార్మికులను తక్షణమే తీసుకోవాలని కోరారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు నాగేశ్వరరావు, రమణ, శేఖర్, శ్రీను తదితరుల పాల్గొన్నారు.

## రసవత్తరంగా అంతర వైద్య కళాశాలల క్రీడా పోటీలు

ఏలూరు రూరల్: ఏలూరు ఆశ్రం వైద్య కళాశాలలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వర్సిటీ అంతర కళాశాలల మహిళల ఆటల పోటీలు సోమవారం ముగిశాయి. వివిధ క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన జట్లకు ఆశ్రం చైర్మన్ గోకరాజు గంగరాజు, జి.రతీదేవి, ఆశ్రం మెడికల్ డైరెక్టర్ కె.అంజిరెడ్డి సీఈఓ కె.హనుమంతరావు, సూపరింటెండెంట్ కె.శాంతయ్య షీల్డ్, మెడల్స్ అందజేశారు. విజేతల వివరాలు ఇలా ఉన్నాయి. వాలీబాల్‌లో విజయనగరం ఎంఐఎంఎస్ జట్టు ప్రథమస్థానం, గుంటూరు మెడికల్ కాలేజ్ జట్టు ద్వితీయ స్థానం సాధించాయి. బాస్కెట్‌బాల్‌లో డాక్టర్ పిన్నమనేని సిద్దార్థ మెడికల్ కళాశాల ప్రథమస్థానం, ఎస్ఆర్ఐ మెడికల్ కళాశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. బ్యాడ్మింటన్‌లో ఆశ్రం మెడికల్ కాలేజీ ప్రథమస్థానం, రాజమండ్రి జీఎస్ఎల్ కాలేజీ రెండో స్థానం, త్రోబాల్‌లో రాజమండ్రి జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ ప్రథమ, విశాఖపట్నం ఎన్ఆర్ఐ కాలేజ్ ద్వితీయ, బాల్ బ్యాడ్మింటన్‌లో ఆశ్రం మెడికల్ కాలేజీ ప్రథమ, అనిల్ నీరుకొండ డెంటల్ కాలేజీ రెండో స్థానం, టేబుల్ టెన్నిస్‌లో శ్రీకాకుళం గ్రేట్ ఈస్టర్న్ మెడికల్ స్కూల్ ప్రథమ, విశాఖపట్నంకు చెందిన గాయత్రి హెల్త్‌కేర్ కళాశాల ద్వితీయ స్థానం, టెన్నిస్ విభాగంలో విశాఖపట్టణం ఎన్ఆర్ఐ కళాశాల ప్రథమ, చిన్నకాకాని ఎన్ఆర్ఐ కళాశాల ద్వితీయ, చెస్‌లో కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల జట్టు ప్రథమ, రాజమండ్రి జీఎస్ఎల్ కళాశాల జట్టు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.

## టీడీపీ అభ్యర్థులు వలస పక్షులు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, వరుదు కల్యాణి

ఎస్.రాయవరం : వలస పక్షులను తెచ్చుకుంటే గానీ అభ్యర్థులను నిలబెట్టుకోలేని స్థితిలో ఉన్న చంద్రబాబు వైఎస్సార్‌సీపీ పారాచ్యూట్ అభ్యర్థిని బరిలో దింపిందని చెప్పడం హాస్యాస్పదమని పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు అన్నారు. పి.ధర్మవరంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తనను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాయకరావుపేట ఇన్‌చార్జి చేశారన్నారు. తనకు ఇక్కడి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి గెలుపు గుర్రాలకే సీట్లు ఇచ్చారని, చంద్రబాబు కుమ్ములాటలకు తెర లేపారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రకు వస్తున్న ఆదరణ చూడలేక విజయవాడలో రాళ్ల దాడి చేయించారన్నారు. వచ్చే ఎన్నికల్లో పాయకరావుపేటలో భారీ మెజార్టీతో గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ పాయకరావుపేటలో చంద్రబాబునాయుడు మాటలు ఆయనకు మతి భ్రమించిందేమో అన్నట్లు ఉన్నాయన్నారు. ఎస్సీల పుట్టుకను అవమానించిన వ్యక్తి చంద్రబాబునాయుడని, ఎస్సీల అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అంటూ కొనియాడారు. శాంతిని ప్రోత్సహించే జగన్‌మోహన్‌రెడ్డిపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందు, జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, శ్రీపతి రాజు, మాజీ ఎంపీపీ బొలిశెట్టి శారదాకుమారి తదితరులు ఉన్నారు.

# శివుడి ఆజ్ఞ వల్లే ఇక్కడికి వచ్చా...

- తల్లిదండ్రులు, గురువును మించిన దైవం లేదు
- 50 పడకల ఆస్పత్రి శంకుస్థాపనలో సినీ నటుడు సుమన్



నటుడు సుమన్‌కు పూర్ణ కుంభంతో స్వాగతం పలుకుతున్న ధర్మకర్త శర్మ

నాతవరం : దైవ సంకల్పంతోనే తాను ఈ స్థాయిలో ఉన్నానని సినీ నటుడు సుమన్ అన్నారు. మండలంలోని చిక్కుడుపాలెం గ్రామంలో గల శ్రీశివశక్తి క్షేత్రంలో ధర్మకర్త కె.ఎస్.ఎస్.శర్మ ఆధ్వర్యంలో సోమవారం 50 పడకల ఆస్పత్రి నిర్మాణానికి సుమన్ శంకుస్థాపన చేశారు. సుమన్‌కు వేదపండితులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూ.3 కోట్ల వ్యయంతో 85 సెంట్ల విస్తీర్ణంలో నిర్మించే 50 పడకల ఉచిత ఆస్పత్రి నిర్మాణానికి సుమన్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శివుడి ఆజ్ఞ లేనిదే మానవుడు ఏమీ చేయలేడన్న అపారమైన నమ్మకం శివభక్తుడిగా తనకు ఉందన్నారు. ఈ రోజు తనకు చెన్నైలో అనేక కార్యక్రమాలు ఉన్నప్పటికీ ఇక్కడికి వచ్చానంటే శివుడి ఆజ్ఞే కారణంగా భావిస్తున్నానన్నారు. తాను హైదరాబాద్‌లో సినిమా షూటింగ్‌లో ఉండగా శివాలయం ధర్మకర్త శర్మ ఉచిత ఆస్పత్రి నిర్మిస్తున్నామని, శంకుస్థాపనకు రావాలని ఆహ్వానించారన్నారు. మారుమూల ప్రాంత ప్రజలకు ఉచిత వైద్యం అందించే మంచి కార్యక్రమానికి తన వంతు తోడ్పడాలని నిర్ణయించుకున్నాను అన్నారు. తన స్నేహితులు, సినిమా పరిశ్రమలో ఉన్న శివభక్తుల దృష్టికి ఈ ఆస్పత్రి విషయం తీసుకెళ్లి వారి ఆశీస్సులు కోరతానన్నారు. విదేశాల్లో ఉన్న వారు సైతం ఇలాంటి సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలంటే సెలబ్రిటీలు ఇలాంటి కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనాలన్నారు. ప్రతి వ్యక్తి దైవం లాంటి తల్లిదండ్రులు, గురువులను మరిచిపోకూడదన్నారు. ఇతర దేశాలతో పోల్చుకుంటే మన దేశంలో భక్తిభావం అధికమని, అందువల్లే ఇక్కడ యుద్ధాలు లేకుండా ప్రశాంతంగా ఉంటుందన్నారు. ఉక్రెయిన్, రష్యా వంటి దేశాల్లో యుద్ధాల కారణంగా ప్రతి రోజు మరణాలు నమోదు అవుతున్నాయన్నారు. విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, అందువల్ల ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్నారు. ఎన్నికల్లో డబ్బు, బిర్యానీ, మందు వంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.

**750 సినిమాల్లో నటించాను,,**

తాను సినిమా పరిశ్రమలో అడుగు పెట్టి 46 ఏళ్లు అయిందన్నారు. ఇంత వరకు వివిధ భాషల్లో 750 సినిమాల్లో నటించానన్నారు. తెలుగులో 100 సినిమాల్లో హీరోగా నటించానని, తమిళంలో 50 సినిమాలు, కన్నడ తదితర భాషల్లో నటించానన్నారు. తెలుగు సినిమాల్లో అన్నమయ్య సినిమా జీవితాంతం గుర్తుండిపోయేలా చేసిందన్నారు. ఆ సినిమా షూటింగ్ సమయంలో 8 నెలల పాటు కుటుంబానికి దూరంగా ఉంటూ చెప్పులు వేసుకోకుండా ప్రతిరోజు చన్నీళ్ల స్నానం చేశానన్నారు. దైవ స్మరణతో గడిపేవాడినని తెలిపారు. ఆ సినిమాతో శ్రీ వేంకటేశ్వస్వామిపై ఎనలేని భక్తిభావం పెరిగిందన్నారు. అన్నమయ్య సినిమా చూసిన అప్పటి రాష్ట్రపతి శంకర్‌దయాళ్ శర్మ తనను ఢిల్లీ పిలిపించుకుని కలిసి టిఫిన్ చేశారన్నారు. తనను ఘనంగా సత్కరించి పంపించారన్నారు. అది సినిమా పరిశ్రమలో ప్రత్యేకత సంతరించుకునేలా చేసిందన్నారు. సినిమా పరిశ్రమలో ఎలాంటి సపోర్టు లేదన్నారు. పన్నెండేళ్ల వయసులో నేర్చుకున్న కరాటే కష్ట సమయంలో ఆత్మస్థైర్యం అందించిందన్నారు. శివుడు, శ్రీవేంకటేశ్వస్వామిని పూజిస్తానన్నారు. ఇక్కడికి రావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం శివశక్తి క్షేత్రం భూగర్భంలో గల శివుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ధర్మకర్త, వేదపండితులు సుమన్‌ను ఘనంగా సత్కరించారు. సుమన్‌ను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఆయన వెంట నర్సీపట్నానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త వెలగా నారాయణరావు, వినాయక ఆలయ కమిటీ చైర్మన్ దేవత సురేష్, అరుణ, వర్ధమాన నటులు సతీష్, రాము తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ప్రచారం



తాళ్లపాలెం బీసీ కాలనీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం బీసీ కాలనీలో సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌లను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కరపత్రాలను అందించి అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, పార్టీ నాయకులు ఇందలి ముసిలినాయుడు, గుమ్మడి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికల్లో కూటమికి ప్రజలే బుద్ధి చెబుతారు..



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు

అనకాపల్లి: ఎందరో మహానుభావుల ప్రాణ త్యాగాల ఫలితంగా స్టీల్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకున్నామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు తెలిపారు. స్థానిక వై.విజయకుమార్ హాల్లో ప్రజా సంఘాల నేతలతో సోమవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కుట్ర చేసిన మోదీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో విశాఖ ఉమ్మడి జిల్లాల ప్రజలు తగిన బుద్ధి చెప్పే సమయం వచ్చిందన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ రాజ్యసభలో ఒకసారైన స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంపై మాట్లాడిన పాపాన లేదన్నారు. ఇప్పుడు ఓట్లు కోసం అనకాపల్లి గుర్తుకు వచ్చిందని ఆయన ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు పెంటకోట సత్యనారాయణ, రుత్తల శంకరరావు, సిహెచ్.రాంబాబు, గాడి బాలు, బూసి పరమేశ్వరి, సాయి లక్ష్మణ్ పాల్గొన్నారు.

### బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 4,717 బెల్లం దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| స్పెషల్ రకం | 3,710 | 4,290 |
| మొదటి రకం | 3,500 | 4,250 |
| రెండో రకం | 3,430 | 4,100 |
| మూడోరకం | 3,290 | 3440 |

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| లవ్‌గురు | : రాజా |
| శ్రీరంగ నీతులు | : సత్యనారాయణస్క్రీన్-1 |
| ఐమాక్స్ | : సత్యనారాయణస్క్రీన్-2 |
| గీతాంజలి | : షిర్డిసాయి |
| ఫ్యామిలీ స్టార్ | : పర్తిసాయి |
| మంజుమ్మెల్ బాయ్స్ | : వెంకటేశ్వర |
| మెర్సీ కిల్లింగ్ | : శ్రీసత్య |
| డీజే టిల్లు-2 | : రామచంద్ర |

### రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, ఏ నెగిటివ్-2, బీ పాజిటివ్-8, బీ నెగిటివ్-2, ఓ పాజిటివ్-13, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను ఫోన్ నంబర్ 97036 19706)లో సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 368 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 294 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



# సంక్షేమ పథకాలే విజయ సోపానాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు, బూత్ కమిటీల ప్రతినిధులు

- అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించండి
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్
- పార్టీ శ్రేణులు, బూత్ కమిటీల ప్రతినిధులకు దిశానిర్దేశం

కశింకోట: ప్రభుత్వం ఐదేళ్లలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి దోహదపడతాయని పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. మండలంలోని తాళ్లపాలెంలో పార్టీ శ్రేణులు, ఎన్నికల బూత్ కమిటీల ప్రతినిధులతో సోమవారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. గడప గడపకు ఎన్నికల ప్రచారంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. సీఎం జగన్ అమలు చేసిన నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించాలన్నారు. వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకతను తెలియజేయాలన్నారు.

**18 నుంచి ముమ్మరంగా ప్రచారం**

శ్రీరామనవమి తర్వాత ఈ నెల 18 నుంచి గడప గడపకు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహిస్తామని భరత్‌కుమార్ తెలిపారు. తన గెలుపు ఖాయమని, అత్యధిక మెజారిటీ రావడం ముఖ్యమన్నారు. గతంలో అనకాపల్లికి చెందిన వారు, స్థానికేతరులు ఎమ్మెల్యేలుగా పదవులు నిర్వర్తించారని, ఇప్పుడు స్థానికుడిగా పార్టీ నుంచి తొలిసారిగా పోటీ చేస్తున్నందున మండలం నుంచి 15 వేల ఓట్లు ఆధిక్యం రావాలని, ఇది గౌరవప్రదంగా ఉంటుందన్నారు. నెల రోజులు కష్టపడి పనిచేస్తే ఐదేళ్ల పాటు ప్రజలకు, పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు. పార్టీ అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, తనను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని, ఇందుకు పార్టీ శ్రేణులు కష్టపడి ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, వైఎస్ ఎంపీపీలు పెంటకోట జ్యోతి, నమ్మి మీనా, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కరక శేషు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# వేడుకగా సీతారాముల పెళ్లి రాట



కశింకోట గవరపేటలో రామాలయం వద్ద పెళ్లి రాట వేసి పూజలు చేస్తున్న భక్తులు



కల్యాణ రాట ఉత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ సునీత, సంఘ సభ్యులు



చేపల బజారు రామాలయం వద్ద పెళ్లి రాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి: పట్టణంలో పలు సీతారాముల ఆలయాల వద్ద పెళ్లిరాట వేడుకలు సోమవారం జరిగాయి. స్థానిక వేల్పులవీధి సీతారామాలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులు జెట్టి శ్రీనివాసరావు, వెదుళ్ల నూకేష్ ఆధ్వర్యంలో మహిళలు పెళ్లిరాట వేశారు. మెయిన్‌రోడ్డు, చేపల బజారు సీతారాముల ఆలయం వద్ద ఆలయ అధ్యక్షుడు కె.నారాయణరావు ఆధ్వర్యంలో రాట మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17న సీతారాముల కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం, సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు కొణతాల జగన్నాథరావునాయుడు, కార్యదర్శి శిరసపల్లి సూరిబాబు, కోశాధికారి డి.వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కామధేను ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

**రాములోరి కల్యాణం రేపు**

స్థానిక నర్సింగరావుపేట, శ్రీశారద బాలగణపతి వినాయక సంఘం ఆధ్వర్యంలో రామాలయం వద్ద రాములోరి కల్యాణ రాటను 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 17న ఉదయం 10 గంటలకు ఆలయంలో రాములవారి కల్యాణం జరుగుతుందన్నారు. దీన్ని తిలకించేందుకు భక్తులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: కశింకోటలోని గవరపేటలో కొలువు దీరిన శారదా గణపతి రామాలయంలో సోమవారం సీతారాముల పెళ్లి రాట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ నెల 17న శ్రీరామ నవమి పురస్కరించుకుని సీతారాముల కల్యాణోత్సవం భారీ స్థాయిలో జరగనుంది. ఈ సందర్భంగా ముందుగా పెళ్లి రాట వేసే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రామాలయంలో పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గానాగేశ్వరరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రజల పక్షాన సీఎం జగన్



అవ్వను ఓటు అడుగుతున్న మలసాల భరత్‌కుమార్



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్‌కు హారతులిస్తున్న మహిళలు

- అవకాశమివ్వండి.. అభివృద్ధి చేస్తా...
- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో బలహీన వర్గాల ప్రజల తరఫున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి పోటీ చేస్తున్నారని, ధనవంతులందరూ కూటమిగా పోటీ చేస్తూ పేదలకు అన్యాయం చేయాలని కుట్రలు పన్నుతున్నారని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. మండలంలోని సిహెచ్.ఎన్.అగ్రహారంలో గ్రామ సర్పంచి కొల్లిమల్లి గోవింద్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి గడప గడపకు ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఇంటింటికీ ఆయన వెళ్లి అవ్వాతాతలను ఆప్యాయంగా పలకరిస్తూ, యువతకు భరోసా కల్పిస్తూ మే 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఒక్క అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలను గ్రామీణ స్థాయికి అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి గ్రామ రూపురేఖలు మార్పునకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ముందుగా గ్రామంలో నూకాంబికను, సీతారాములవారిని భరత్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, ఉపాధ్యక్షుడు నొట్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ కోరుకొండ అచ్చియ్యమ్మ, పార్టీ నాయకులు అర్జున్ నాగేశ్వరరావు, మద్దాల రమణ, బాబ్జీ, శ్రీనివాసరావు, సైదినాయుడు, కొండబాబు, సంతోష్, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం యువత బాధ్యత



రక్తదానం చేస్తున్నన్న ఆస్పత్రి సిబ్బంది

అనకాపల్లి: ఆరోగ్యవంతులైన యువతీ, యువకులు రక్తదానం చేసి ఆపదలో ఉన్న రోగుల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని ఎన్టీఆర్ వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ వైద్యురాలు కనకదుర్గ అన్నారు. స్థానిక వైద్యాలయం ఆవరణలో సోమవారం 15 మంది వైద్య సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20 నుంచి 60 ఏళ్ల వయసు గల ఆరోగ్యకరమైన వ్యక్తులు ఏడాదికి రెండు సార్లు రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదానం చేసిన వ్యక్తులకు రెండు మూడు రోజుల్లో శరీరంలో కొత్త రక్తం ఉత్పత్తి అవుతుందని చెప్పారు. రక్తదానం చేయడం వల్ల గుండెకు సంబంధించిన వ్యాధులతోపాటు వివిధ రకాల రోగాల నుంచి విముక్తి కలుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఉద్యోగులు పాల్గొన్నారు.

## పెరిగిన బంగాళదుంప ధర

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం బంగాళదుంప ధర పెరిగింది. గత వారం కిలో రూ.30 ఉండగా.. ఈవారం రూ.40కు పెరిగింది. ఇక టమాటా, ఉల్లిపాయ రూ.30, దొండకాయ, బెండకాయ, వంకాయ, క్యాబేజి రూ.40, బీట్రూట్, క్యారెట్, బీరకాయ రూ.60, బీన్స్, చిక్కుడుకాయ, క్యాప్సికం రూ.80, అల్లం రూ.300కు విక్రయాలు సాగాయి.

## ఆరుగురు వలంటీర్ల రాజీనామా

కశింకోట: మండలంలోని నూతలగుంటపాలెం పంచాయతీలో ఆరుగురు గ్రామ వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. యలమంచిలి మారేష్, నమ్మి సతీష్, నమ్మి వరకుమార్, పెదిరెడ్డి రమాదేవి, కోరిబిల్లి చిలుకుబాబు, రాయి దామోదర్ వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శికి పత్రాలు అందజేశారు.

## నేడు బూత్ కమిటీల సమావేశాలు

కశింకోట: కశింకోటలోని గవరపేట, సంతబయలు ఎస్సీ కాలనీల్లో మంగళవారం సాయంత్రంవైఎస్సార్ సీపీ ఎన్నికల బూత్ కమిటీల సమావేశాలు వేర్వేరుగా నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

## 21న పాటిపల్లి మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

మునగపాక: మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్లో ఈ నెల 21న 6వ తరగతిలో ప్రవేశాలకు పరీక్ష జరుగుతుందని ప్రిన్సిపాల్ పీపీఎస్ శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే పరీక్షకు సంబంధిత విద్యార్థులు సకాలంలో హాజరు కావాలన్నారు. అలాగే హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ పరీక్ష 5వ తరగతి స్థాయిలో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

# మోదీ పాలనలో వ్యవస్థలు కుదేలు



కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

అనకాపల్లి: మోదీ పాలనలో దేశంలో అన్ని వ్యవస్థలు తీవ్ర స్థాయిలో నష్టపోయాయని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సభ్యుడు మనోజ్ చౌహాన్ విమర్శించారు. స్థానిక నాయుళ్ల వీధిలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. దేశంలో అన్ని వ్యవస్థలను తన గుప్పిట్లో పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని మోదీ కాలరాస్తున్నారని ధ్వజమెత్తారు. మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చే దిశలో మోదీ శతవిధాలా ప్రయత్నిస్తున్నారని చెప్పారు. అసెంబ్లీ అభ్యర్థి ఐ.ఆర్.గంగాధర్, ఎంపీ అభ్యర్థి వేగి వెంకటేష్ మాట్లాడుతూ దేశంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రజామోదం గల మేనిఫెస్టోను తమ పార్టీ విడుదల చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నర్సీపట్నం అభ్యర్థి రుత్తల శ్రీరామమూర్తి, పాయకరావుపేట అభ్యర్థి బోను తాతారావు, సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు కె.లోకనాథం, బి.వెంకటరమణ, పి.ఎస్.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

# యాదవ కులస్తులకు అండగా ఉంటా..



మలసాల భరత్‌కుమార్‌ను పూలమాలతో సత్కరిస్తున్న యాదవ సంఘాల ప్రతినిధులు

అనకాపల్లి: నియోజకవర్గంలో యాదవ కులస్తులకు అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక రామచంద్రా థియేటర్ సమీపంలోని యాదవ కులస్తుల సంఘం కార్యాలయంలో సంఘాల ప్రతినిధులతో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యాదవులకు తగిన గుర్తింపు రాష్ట్రంలో ఇచ్చారన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గుర్తు ఫ్యాన్‌కు ఓటు వేసి యాదవ కులస్తులందరూ సహకరించాలని కోరారు. గెలిచిన వెంటనే మరోసారి సమావేశం నిర్వహించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం సంఘాల ప్రతినిధులందరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

**జగన్‌ను మరోసారి గెలిపించుకుంటాం**

యాదవ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఐదేళ్ల సీఎం వైఎస్ జగన్ పాలనలో అనేక సంక్షేమ పథకాలు అందుకున్నామని, రానున్న ఎన్నికల్లో మరోసారి సీఎంగా గెలిపించుకుని యాదవ కులస్తులు అభ్యున్నతికి మరింత కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘ మండల అధ్యక్షుడు పంచదార్ల కన్నారావు, సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి కోన ఉమా యాదవ్, వివిధ సంఘాల ప్రతినిధులు కుండల రామకృష్ణ, మురుకుర్తి శ్రీను, మొల్లి నాయుడు, ఐతా రాము, కారుకొండ కన్నయాదవ్, వాము సన్యాసిరావు, బాదం తాతారావు, కరక సోమునాయుడు, బోయిన శ్రీను, భర్నికాన రాము, దాకారపు గోవిందు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీకే ప్రజలను ఓటు అడిగే హక్కు



కశింకోటలో వైఎస్సార్ సీపీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు

కశింకోట: ప్రజలను ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకి మాత్రమే ఉందని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు అన్నారు. స్థానిక శారదానది అవతల గృహంలో ఆదివారం రాత్రి నిర్వహించిన పార్టీ శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ పాలనలో ప్రతి కుటుంబం లబ్ధి పొందిందన్నారు. కశింకోటలో కోట్లాది రూపాయలతో సిమెంట్ రోడ్లు, కాలువలు, మదుంలు, కల్యాణ మండపం నిర్మాణం వంటి అభివృద్ధి పనులు జరిగాయన్నారు. సంక్షేమ పథకాలతో కలిగిన లబ్ధిని, అభివృద్ధి పనుల గురించి గడప గడపకు ఎన్నికల ప్రచారంలో ప్రజలకు వివరించాలన్నారు. వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌ల విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. విజయవాడలో బస్సు యాత్ర నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై రాయి విసిరి హత్యాయత్నం చేయాలనే దుశ్చర్యకు టీడీపీ పాల్పడటం దుర్మార్గ చర్య అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఎన్నికల పీవో, ఏపీవోలకు శిక్షణ



ఎన్నికల పీవో, ఏపీవోలకు శిక్షణ నిర్వహిస్తున్న ఆర్‌వో గీతాంజలి

పాయకరావుపేట : మే 13న జరగనున్న ఎన్నికలకు సంబంధించి పీవో, ఏపీవోలకు శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో సోమవారం శిక్షణ నిర్వహించారు. మంగళవారం కూడా ఈ కార్యక్రమం జరుగుతుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.గీతాంజలి తెలిపారు. పోలింగ్ స్టేషన్లలో పీవో, ఏపీవోల విధులు, బాధ్యతల గురించి శిక్షణలో అవగాహన కల్పించారు. నియోజకవర్గంలో గల పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాలకుగాను 772 మంది సిబ్బందికి శిక్షణ నిర్వహిస్తున్నారు. సోమవారం 385 మందికి, మంగళవారం 392 మందికి శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 4 మండలాలకు చెందిన మండల తహసీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులుతో పాటు మండల పరిషత్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణకు..**

మాడుగుల: ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించడానికే పోలింగ్ అధికారులతోపాటు సహాయ పోలింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించామని మాడుగుల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వి.సత్యవాణి తెలిపారు. సోమవారం స్థానిక బాలుర హైస్కూల్‌లో పీవోలు, ఏపీవోల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఏడు గదుల్లో 260 మందికి తొలిరోజు శిక్షణ ఇచ్చారు. కె. కోటపాడు తహసీల్దారు జె. ఈశ్వరమ్మ పోస్టల్ బ్యాలెట్లతోపాటు ఫారం-12 తీసుకున్నారు. కార్యక్రమంలో మాడుగుల తహసీల్దార్ సత్యనారాయణ, ఎన్నికల డీటీ రాజా, ఎన్నికల జూనియర్ అసిస్టెంట్ పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# మానవ తప్పిదాలతో అగ్ని ప్రమాదాలు



రైల్వేస్టేషన్ వద్ద అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారి నర్సింగరావు

అనకాపల్లి: మానవ తప్పిదాల వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అగ్నిమాపక శాఖ అధికారి బి.నర్సింగరావు అన్నారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. రైల్వే స్టేషన్ వద్ద అవగాహన కల్పించి మాక్ డ్రిల్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, వంటగదిలో వంట చేసే సమయంలోను, విద్యుత్ వాడకంలోను ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం రింగ్ రోడ్డు జంక్షన్ వద్ద వాటర్ డెమో కార్యక్రమాన్ని నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాఖ ఉద్యోగులు, సీఎంఆర్ షాపింగ్ మాల్ ఉద్యోగులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ముమ్మరంగా వాహన తనిఖీలు

మునగపాక : పరిమితికి మించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ పి.ప్రసాదరావు హెచ్చరించారు. మండలంలోని నాగవరం జంక్షన్ వద్ద సోమవారం రాత్రి వాహనాలు తనిఖీ చేశారు. ఓవర్ లోడుతో వెళ్తున్న మూడు టిప్పర్లను గుర్తించి రూ.లక్షా 92 వేల 910 అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రసాదరావు మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

# మేలు చేసే భగవంతుని నామస్మరణ



భక్తులకు తత్వబోధ చేస్తున్న సచ్చిదానంద సరస్వతి స్వామీజీ

రాంబిల్లి: భగవంతుని నామస్మరణతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తే అందరికీ మేలు జరుగుతుందని తపోవనం ఆశ్రమం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామీజీ అన్నారు. పంచదార్లలో గల ద్విముఖ కల్యాణ వినాయక ఆలయంలో సోమవారం ఆయన భక్తులకు తత్వబోధ చేశారు. గ్రామాల్లో భజనలు, నగర సంకీర్తనలు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యాచరణ సభ్యులు పాల్గొన్నారు.

# వారపు సంతపై ఎండ ప్రభావం



కొనుగోలుదారుల కోసం ఎదురు చూస్తున్న గిరిరైతులు

మాడుగుల: స్థానిక వారపు సంతపై ఎండ ప్రభావం చూపింది. కొన్ని రోజులుగా తీవ్రంగా కాస్తున్న ఎండలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు వారపు సంతకు కొనుగోలుదారులు రాక చింతపండు అమ్ముడుపోలేదు. 50 కిలోల కావిడి చింతపండు గత వారం రూ.1,600 ఉండగా, ఈ వారం రూ.800కు పడిపోయింది. ఇంతవరకు ఉద యం 10 గంటలకే చింతపండు అమ్ముడుపోయేది. కొందరు గిరి రైతులు చింతపండు అమ్ముడుపోక తిరిగి స్వగ్రామాలకు తీసుకుపోయారు. 20 కిలోమీటర్ల దూరం నుంచి సంత కు వచ్చినా ఖర్చులు రాలేదని వాపోయారు.